సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం ၊ 25 ၊ అక్టోబర్ ၊ 2024



సోమశిలలో 62.02 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 62.023 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 25,375 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.80,650
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,308
3 శాతం జీఎస్టీతో	రూ.7,527
నవర (8 గ్రా)	రూ.60,216

గరిష్టం/కనిష్టం
35.6 /26.4

వాతావరణం

జిల్లాలో శుక్రవారం వాతావరణం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 50 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

డీఈఓగా బాలాజీరావు



నెల్లూరు (టౌన్): డీఈఓగా బాలాజీరావును నియమిస్తూ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. పల్లిపాడులోని డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా ప్రస్తుతం ఈయన పనిచేస్తున్నారు. గతంలో సమగ్రశిక్ష పీఓగా, అసిస్టెంట్ మానిటరింగ్ అధికారిగా పనిచేశారు. కాగా డీఈఓగా బాధ్యతలను శుక్రవారం స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న రామారావు కృష్ణా డీఈఓగా బదిలీ అయ్యారు.

డీఆర్వో బదిలీ



లవన్న

నెల్లూరు(దర్గామిట్ట): డీఆర్వో లవన్నను విజయవాడకు రిపోర్ట్ చేస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా డీఆర్వో ఉదయ్‌భాస్కర్‌ను ఇక్కడ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ చిన్న ఓబులేసును ప్రకాశం జిల్లా డీఆర్వోగా నియమించారు.

జాబ్‌మేళా నేడు

నెల్లూరు రూరల్: జాబ్‌మేళాను శుక్రవారం నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి వినయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్, నెల్లూరులోని ఐటీఐ బాలుర, ఉదయగిరిలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి డిగ్రీ కళాశాలల్లో ఉదయం 10.30కు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వివరించారు. పదో తరగతి, డిగ్రీ పాసై 18 నుంచి 36 ఏళ్లలోపు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, బయోడేటా, ధ్రువీకరణ పత్రాలను విధిగా తీసుకురావాలని సూచించారు.

నేటి నుంచి పశుగణన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో పశుగణనను శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు నిర్వహించనున్నామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. పశుసంవర్థక శాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టరేట్లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్‌నాయక్ మాట్లాడారు. దేశంలో ప్రతి ఐదేళ్లకోసారి పశుగణనను నిర్వహించనున్నారని చెప్పారు. అధికారులు సోమయ్య, నాగమణి, రామచంద్రారెడ్డి, మంజునాథ్‌సింగ్ పాల్గొన్నారు.

భోజనాన్ని తినలేకపోతున్నాం



నినాదాలు చేస్తున్న విద్యార్థులు

సోమశిల: అనంతసాగరం మండలంలోని సోమశిల ప్రాజెక్ట్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనాన్ని తినలేకపోతున్నామంటూ నినాదాలతో విద్యార్థులు గురువారం హోరెత్తించారు. పాఠశాలలో వసతులు, తలుపులు, భోజనాలు సక్రమంగా లేవని చెప్పారు. సమస్యను అధికారులు పరిష్కరించాలని కోరారు.

రీచ్‌లపై పచ్చ రాబందులు



యంత్రం సాయంతో తవ్వకం





పొట్టేపాళెం రీచ్‌లో ఇసుకను కొల్లగొట్టేందుకు సిద్ధంగా ట్రాక్టర్లు

ఉచిత ఇసుక పేరుతో పెన్నా గర్భాన్ని కొల్లగొడుతున్న వైనం

- భారీ వాహనాల్లో యథేచ్ఛగా తరలింపు
- నిబంధనలకు విరుద్ధంగా యంత్రాల వినియోగం
- అధికార పార్టీ నేతల గుత్తాధిపత్యం
- ప్రతి వాహనానికీ కప్పం
- అనుమతుల్లేకుండా రోడ్ల నిర్మాణం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇసుకను పచ్చ పార్టీ నేతలు కొల్లగొడుతున్నారు. భారీ వాహనాల్లో వీటిని తరలిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఈ తంతు నిత్యం జరుగుతూనే ఉన్నా, చోద్యం చూడటం అధికారుల వంతవుతోంది. ఈ పరిణామాల క్రమంలో జిల్లాలో అసలు అధికార యంత్రాంగం ఉందానసే అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని సంగం, సూరాయపాళెం, పోతిరెడ్డిపాళెం వద్ద డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి ఇసుక రవాణాను సాగిస్తున్నారు. మరో నాలుగు ఓపెన్ రీచ్‌లకు అన్ని అనుమతులను పొందారు. పల్లిపాడు, మినగల్లు, విరువూరు, పడమటి కంభం పాడు రీచ్‌ల నుంచి ఇసుకను స్టాక్ పాయింట్లకు తరలించేందుకు టెండర్లను ఇటీవల పిలిచారు. అయితే అధికార పార్టీకి చెందిన వారికి రాలేదనే కారణంతో టెండర్లనే రద్దు చేశారు. ఒక్కో రీచ్‌లో 60 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను తవ్వుకునేలా అధికారులు గుర్తించారు. దీన్ని స్టాక్ పాయింట్లకు తరలించే ప్రక్రియను త్వరలో చేపట్టేలా మైనింగ్ అధికారులు చూస్తున్నారు.

మైనింగ్ అధికారులు చెప్తోందిదీ..

నదీ పరీవాహక ప్రాంతాల్లో కేవలం ఎడ్ల బండ్లు మాత్రమే ఇసుకను ఉచితంగా తీసుకునేందుకు అనుమతి ఉందని, ట్రాక్టర్లకు ఎలాంటి అనుమతుల్లేవని మైనింగ్ అధికారులు చెప్తున్నారు. వాగులు, వంకల్లో అయితే ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా ఉచితంగా తీసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఉచితంగా ఇస్తామంటున్నా, దానికి తగిన విధంగా నేటికీ ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలుపుతున్నారు.

జరుగుతోందిలా..

నెల్లూరు రూరల్, నెల్లూరు సిటీ, కోవూరు నియోజకవర్గాల్లో పెన్నా తీరాన్ని టీడీపీ నేతలు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. నెల్లూరులోని వెంకటేశ్వరపురం, పొట్టేపాళెం, కోవూరులోని మినగల్లు, ముదివర్తి, జొన్నవాడ, పొదలకూరు సమీపంలోని సూరాయపాళెం, విరువూరు రీచ్‌లను పచ్చ నేతలు ఆక్రమించి, రోడ్లను నిర్మించుకున్నారు. భారీ యంత్రాలను పెన్నాలో ఉంచి లోడింగ్ చేస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ.1500, టిప్పర్‌కు రూ.ఐదు వేల వంతున వసూలు చేస్తున్నారు.

పెన్నా గర్భాన్ని జిల్లాలోని అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ఉచిత ఇసుక విధివిధానాలు పూర్తి స్థాయిలో రాకముందే రీచ్‌లను టీడీపీ నేతలు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. నిబంధనలను అతిక్రమించి ఇందులోకి వెళ్లేందుకు వీలుగా రోడ్లను నిర్మించి చెక్ పోస్టులూ పెట్టారు. ఇసుకను వాహనాల్లో లోడ్ చేసేందుకు కప్పం కట్టించుకుంటున్నారు. అధికార పార్టీ నేతలు ఈ దందా సాగిస్తున్నా, ఆవైపు అధికారులు కన్నెత్తి చూస్తున్న దాఖలాల్లేవు.

..ష్.. గప్‌చుప్

నిబంధనలకు విరుద్ధంగా పెన్నాలో భారీ యంత్రాలను పెట్టి ఇసుకను లోడింగ్ చేసి, రాత్రి వేళ తరలిస్తున్నారు. ఇలా నిత్యం రూ.25 కోట్ల విలువైన ఇసుక అక్రమంగా రవాణా అవుతున్నా, ఏ అధికారీ పట్టించుకోకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. అధికార పార్టీ సేవలో మునిగి తేలుతుండటంతో అక్రమార్కులకు అడ్డూ అదుపులేకుండా పోతోంది.

కలెక్టర్‌ను నేడు కలవనున్న వైఎస్సార్‌సీపీ నేతలు

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా.. రీచ్‌లలో అధికార పార్టీ నేతల దోపిడీ పర్వంపై ఆధారాలతో సహా వివరించేందుకు కలెక్టర్ ఆనంద్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు శుక్రవారం కలవనున్నారు. వీఆర్సీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా కలెక్టరేట్ వద్దకెళ్లి వినతిపత్రాన్ని అందజేయనున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు హాజరుకానున్నారు.



నీటిలో కూరుకుపోయినా తగ్గేదేలే..

ఇలా నిత్యం రెండు వేల వాహనాల్లో లోడింగ్ ప్రక్రియ జరుగుతోంది.

అంతా ఇతర రాష్ట్రాలకే..

కొల్లగొట్టిన ఇసుకను ఇతర రాష్ట్ర అవసరాలకే తరలిస్తున్నారు. టిప్పర్ల యజమానులు వ్యాపారవేత్తలు కావడంతో ఈ తంతు యథేచ్ఛగా జరుగుతోంది. ఇక ట్రాక్టర్ల పరిస్థితి అంతు చిక్కడంలేదు. ఇలా వందల వాహనాల్లో వెళ్లి లోడింగ్ చేసుకుంటున్నారు. ఎక్కడపడితే అక్కడ స్టాక్ యార్డులు పెట్టి తోలుతున్నారు. ఇదో వేలం వెర్రిలా మారిపోయింది.

నాణ్యత డొల్ల

హైవే నిర్మాణ పనుల్లో అవినీతి

- వాహనాలు రోడ్డెక్కక ముందే పగుళ్లు
- కొద్దిపాటి వర్షాలకే దెబ్బతింటున్న మార్జిన్లు
- పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు

తమ ప్రాంతాల మీదుగా జాతీయ రహదారి సాగితే అభివృద్ధి పరుగులు తీస్తుందని అందరూ భావిస్తారు. ఇదే కోవలో కావలి – సీతారామపురం మీదుగా 167 బీజీ హైవే నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే దీని పనులు అత్యంత నాసిరకంగా జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఇక్కడ పనులు జరగడంలేదు. నాణ్యత డొల్లగా మారిన తరుణంలో వాహనాలు రోడ్డెక్కక ముందే పగుళ్లు ఏర్పడుతున్నాయి. అవినీతి కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉదయగిరి: కావలి – సీతారామపురం మధ్య 167 బీజీ హైవేలో బీటీ రోడ్డు అత్యంత నాసిరకంగా మారింది. ఎంతో కాలం పాటు నాణ్యతగా ఉండాల్సిన జాతీయ రహదారి.. నిర్మించిన రెండు నెలలకే పగుళ్లిస్తోంది. పలుచోట్ల మార్జిన్లు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఎన్‌హెచ్ – 16ను అనుసంధానం చేస్తూ.. కావలి, ఉదయగిరి నియోజకవర్గాల మెట్ట పల్లెలను కలుపుతూ రాయలసీమ, కర్ణాటక మధ్య రవాణాకు అత్యంత కీలకమైన రహదారిగా దీన్ని నిర్మించాలని సంకల్పించారు. అయితే ఈ పనుల్లో అవినీతి, అక్రమాలు రాజ్యమేలుతున్నాయి.

పనులూ అసంపూర్తిగానే

కావలి నుంచి వింజమూరు, దుత్తలూరు మీదుగా రాయలసీమ జిల్లాలు, బెంగళూరుకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రయాణ సమయాన్ని తగ్గిస్తూ.. ప్రమాదాలకు తావు లేకుండా ఉండాలనే లక్ష్యంతో 167 బీజీ జాతీయ రహదారిగా మారుస్తూ రోడ్డు విస్తరణ పనులను గత ప్రభుత్వ హయాంలో చేపట్టారు. మొదటి దశలో కావలి నుంచి దుత్తలూరు వరకు 66.9 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.423.66 కోట్లను మంజూరు చేశారు. 2022 జూలైలో ప్రారంభించిన ఈ పనులు ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉన్నా, జూన్ వరకు పొడిగించారు. అయితే కొన్ని చోట్ల నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

నిర్మాణ తీరిలా..
కావలి నుంచి
దుత్తలూరు వరకు (మొదటి దశ)
విస్తరణ.. **66.9** కిలోమీటర్లు
కేటాయించిన నిధులు..
రూ.**423.66** కోట్లు

అంతా నాసిరకం

పనులు జరుగుతున్న జలదంకి బైపాస్, జమ్మలపాళెం మార్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అక్కడక్కడా పగుళ్లిచ్చింది. రోడ్డు కుంగి, మార్జిన్లు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. మరోవైపు దుత్తలూరు నుంచి కావలి వరకు చేపట్టిన పనుల నాణ్యతపై మొదట్నుంచీ విమర్శలు వస్తూనే ఉన్నాయి. నాణ్యమైన గ్రావెల్‌ను వినియోగించాల్సి ఉన్నా, స్థానికంగా లభించే నాసిరకం మట్టినే వాడారనే ఆరోపణలున్నాయి.



కొద్దిపాటి వర్షానికే కోతకు గురైన మార్జిన్



జలదంకి – కావలి మధ్య పగుళ్లిచ్చిన రోడ్డు

అప్పటికీ.. ఇప్పటికీ ఎంతో తేడా..!

వాస్తవానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ పనులను ప్రారంభించారు. ఆ సమయంలో పర్యవేక్షణ ఉండటంతో పనులు ప్రణాళికబద్ధంగా జరిగాయి. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కాంట్రాక్టర్ వద్ద ముడుపులు తీసుకొని నాసిరకం పనులకు పచ్చ జెండా ఊపారనే ప్రచారం జరుగుతోంది. ఫలితంగా రోడ్డు ఎక్కడికక్కడ పగిలిపోతోంది. క్వాలిటీ కంట్రోల్ అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

శాపంగా మారిన పర్యవేక్షణ లోపం

- ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం శాపంగా మారింది. నాణ్యత లేని కంకరను వినియోగిస్తుండటంతో రోడ్డు దెబ్బతింటోంది.
- జలదంకి బయట నిర్మిస్తున్న బైపాస్ రోడ్డులో నాణ్యమైన గ్రావెల్‌ను వాడకపోవడం.. రోలింగ్, క్యూరింగ్ సక్రమంగా లేకపోవడంతో వర్షాలతో రోడ్డు కుంగి లోపాలు బయటపడుతున్నాయి.
- వింజమూరు ఎస్టీ కాలనీ వద్ద వంతెన దగ్గర రివిట్మెంట్ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీటికి కోతకు గురైంది.
- దుత్తలూరు నుంచి కలిగిరి వరకు ఉన్న రోడ్డు మార్గంలో చాలా చోట్ల కక్రతుమ్మ చెట్లు విస్తరిస్తున్నాయి. జాతీయ రహదారుల శాఖ అధికారులు స్పందించి నాణ్యత లోపాలను సరిచేసి రోడ్డు నిర్మాణం సవ్యంగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



నిర్మాణ సమయంలోనే రోడ్డు పగుళ్లిస్తోంది. నాణ్యత ప్రశ్నార్థకంగా మారిందనే విషయం దీని ద్వారా స్పష్టమవుతోంది. అడుగు భాగం నుంచి మరోసారి గ్రావెల్ వేసి.. రోలింగ్ చేసి తారు వేస్తే మరోసారి పగుళ్లు రావు. అలా కాని పక్షంలో దెబ్బతినే అవకాశం ఉంటుంది.
– దేవరపల్లి శివారెడ్డి, బ్రాహ్మణక్రాక

రోడ్డు మంజూరైన ఆనందం లేదు



కావలి నుంచి దుత్తలూరు, కడప హైవే నిర్మాణానికి నిధులు మంజూరవ్వడంతో ఎంతో సంతోషించాం. అయితే రోడ్డు దెబ్బతిన డాన్ని చూస్తుంటే ఆ ఆనందమే ఆవిరవుతోంది. పనులు నాణ్యతగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
– ఒంగోలు రాఘవేంద్ర, జలదంకి

పరిశ్రమల ఏర్పాటుకు సకాలంలో అనుమతులు

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుమతులను నిబంధనల మేరకు సకాలంలో మంజూరు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో గురువారం నిర్వహించిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని పత్రాలను నిర్వాహకులు సమర్పించి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఏయే శాఖల పరిధిలో ఎన్ని దరఖాస్తులు.. ఎంత కాలంగా పెండింగ్‌లో ఉన్నాయో పూర్తి వివరాలను అందించాలని ఆదేశించారు. ప్రింటింగ్, గోల్డ్, రెడీమేడ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై దృష్టి సారించాలని సూచించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు పీఎంఈజీపీ రుణాలను విరివిగా మంజూరు చేయాలని తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్, జేసీ కార్తీక్, ఏపీఐఐసీ జెడ్‌ఎం శేఖర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎల్డీఎం శ్రీకాంత్, ప్రదీప్, ఇరిగేషన్ ఎస్‌ఈ దేశ్‌నాయక్, డీటీసీ చందర్, ఏపీఎంఐపీడీ శ్రీనివాసులు, ఆర్డీఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్ సోమిరెడ్డి

- సర్వేపల్లిలో దోపిడీ పర్వం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): సర్వేపల్లి నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న అవినీతి పర్వం రాష్ట్రంలో ఎక్కడా జరగడంలేదని, ఈ రకంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఖ్యాతి గడించారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. నగరంలోని డైకస్‌రోడ్డులో గల తన క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం విషయంలో మోసపూరితమైన పాలసీని ప్రభుత్వం తీసుకొచ్చిందని ధ్వజమెత్తారు. ఇష్టానుసారంగా దోచుకోమంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలకు పగ్గాలిచ్చారని మండిపడ్డారు. ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు సూచించిన వారికే మద్యం షాపు లైసెన్స్‌లను ఎక్సైజ్ అధికారులు కట్టబెట్టారని ఆరోపించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి, ఆయన కుమారుడు పట్టపగలే కన్నాలేయడాన్ని ప్రారంభించారని ఎద్దేవా చేశారు. మద్యం షాపుల విషయంలో వీరిద్దరూ అందినకాడికి దోచుకునేందుకు పథకం పన్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో 28 మద్యం షాపులను ఏర్పాటు చేయగా, ఒక్కో షాపు నుంచి రూ.ఐదు లక్షల చొప్పున ఇవ్వాలని, లేని పక్షంలో అనుమతించబోమంటూ సోమిరెడ్డి హుకుం జారీ చేశారని, దీంతో ఇచ్చుకోక తప్పడం లేదని కొందరు వాపోతున్న అంశాన్ని ప్రస్తావించారు. తాను ప్రెస్‌మీట్‌లో సోమిరెడ్డిపై విమర్శలు చేస్తే, వెంటనే మీరూ పెట్టి విమర్శలు చేయాలనే నిబంధనను మద్యం షాపుల యజమానులకు విధించడాన్ని సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు.

దోచుకోవడం.. దాచుకోవడం

కార్యకర్తల కోసం 30 శాతాన్ని ఇవ్వాలని, బెల్టుషాపుల నుంచి నెలకు రూ.15 వేల చొప్పున, వైన్‌షాపుల పక్కన ఏర్పాటు చేసుకున్న కూల్‌డ్రింక్స్ షాపు నుంచి నెలకు రూ.30 వేల చొప్పున సమర్పించాలంటూ దోపిడీకి సోమిరెడ్డి శ్రీకారం చుట్టారని ధ్వజమెత్తారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు ఒక్క పైసా ఇవ్వకుండా దోచుకున్న మొత్తాన్ని దాచుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే స్థాయికి తగిన విధంగా వ్యవహరించక పోతుండటంపై ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. సర్వేపల్లిలో జరుగుతున్న దోపిడీపై సీఎం చంద్రబాబు విచారణ చేయిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. తాను చెప్తున్న విషయాల్లో వాస్తవం లేదని సోమిరెడ్డి నిరూపించాలని సవాల్ విసిరారు.

చిక్కిన తెల్లదొంగలు

- సైదాపురంలో అక్రమార్కులపై పోలీసుల దాడులు
- శ్రీనివాస పద్మావతి మైన్స్‌లో మైనింగ్
- రెండు టిప్పర్లు, హిటాచీ, జేసీబీల స్వాధీనం
- 13 మందిపై కేసులు నమోదు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సైదాపురం మండలంలో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. క్వార్ట్జ్‌ను చెన్నైకు అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. చీకటి పడితే చాలనే రీతిలో లారీలు, టిప్పర్లతో విచ్చలవిడిగా తమ పని కానిచ్చేస్తున్నారు. తాజాగా సైదాపురం – తూర్పుపూండ్ల మధ్యలో ఉన్న శ్రీనివాస పద్మావతి మైన్స్‌లో ఎలాంటి అనుమతుల్లేకుండానే మైనింగ్‌ను అక్రమంగా సాగిస్తున్నారనే సమాచారంతో ఎస్సై క్రాంతికుమార్ తన సిబ్బందితో కలిసి గురువారం దాడులు చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రెండు టిప్పర్లు, హిటాచీ, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. టీడీపీ నేత అమర్‌నాథరెడ్డి, మరో 12 మందిపై కేసులు నమోదు చేశారు. ఘటన స్థలానికి తహసీల్దార్ రమాదేవి చేరుకొని సమగ్ర విచారణ జరిపారు.

విదేశాల్లో భారీ గిరాకీ

సైదాపురం మండలంలో లభించే క్వార్ట్జ్, పల్స్‌పర్, వెర్మికులైట్ ఖనిజానికి విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కొత్త జీఓను విడుదల చేయాలనే ఉద్దేశంతో జిల్లాలోని అన్ని గనులను మూసేశారు. ఒక్క అమృతేష్ మైకా మైన్‌కు మాత్రమే అనుమతి లభించగా, అదీ కేవలం పల్స్‌పర్‌ను టైల్స్ ఫ్యాక్టరీకి తరలించేందుకే. అయితే కొందరు అక్రమ రవాణా సాగిస్తున్నారు. హైదరాబాద్, రైల్వే కోడూరు అనుమతులతో ఈ ప్రాంతంలో లభించే విలువైన తెల్లరాయిని మరో చోటకు తరలిస్తున్నారు. మరోవైపు జిల్లాలో సుమారు 250కుపైగా యార్డులుండగా, వీటినీ కూటమి ప్రభుత్వం మూసేసింది. అయితే యార్డు యజమానుల్లో కొందరు మాత్రం కూటమి నేతల అండదండలతో తమ పనులను యథేచ్ఛగా సాగిస్తున్నారు.

రవాణా ఇలా..

ఖనిజాన్ని సైదాపురం – పొదలకూరు, వీరంపల్లి మీదుగా నెల్లూరు బైపాస్ ద్వారా తరలిస్తున్నారు. మరి కొందరు టిప్పర్లలో సైదాపురం మీదుగా గూడూరు చేరుకొని బైపాస్‌లోని యార్డులకు తోలి అక్కడి నుంచి చెన్నైకు తీసుకెళ్తున్నారు. పర్మిట్లను మాత్రం హైదరాబాద్ నుంచి తెప్పిస్తున్నారు. ఖాళీ లారీలతో రైల్వే కోడూరు పర్మిట్ల ద్వారా ఇక్కడి ఖనిజాన్ని లోడ్ చేసి చెన్నైకు తరలిస్తున్నారు.

నిత్యం 500 టన్నుల తరలింపు..?

మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి 500 టన్నుల క్వార్ట్జ్, పల్స్‌పర్, వెర్మికులైట్ ఖనిజాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. హైదరాబాద్ నుంచి చెన్నైకు ఖనిజాన్ని తరలించేందుకు పర్మిట్లు పొందిన వారు ఈ రకంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ఇక్కడ లభించే క్వార్ట్జ్ ఖనిజం టన్ను రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు పలుకుతోంది. క్వార్ట్జ్ మైకా టన్ను రూ.25 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు ఉంటోంది. ఇలా దాదాపు రోజూ రూ.15 కోట్ల విలువైన ఖనిజాన్ని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

మరో వాహనాన్ని వదిలేశారనే ఆరోపణలు..

పోలీసుల దాడుల్లో మరో హిటాచీ ఉన్నా, రాజకీయ ఒత్తిళ్లతో వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాడుల అనంతరం స్థానిక పోలీసులపై అధికార పార్టీ నేతలు తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. కాగా ఈ విషయమై ఎస్సైను సంప్రదించగా, వాహనాలను వదిలిపెట్టలేదని బదులిచ్చారు.

విత్తన సబ్సిడీకి కత్తెర

కూటమి ప్రభుత్వానికి అన్నదాతలంటే లెక్క లేకుండా పోయింది. వారికి అన్ని విధాలా అండగా ఉండాల్సిందిపోయి కష్టాల్లోకి నెడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా ప్రతి విషయంలో ఆదుకోగా నేటి చంద్రబాబు సర్కారు రాయితీల్లో కోతలు విధిస్తోంది. దీంతో రైతుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

- శనగ విత్తనాల రాయితీకి కూటమి ప్రభుత్వం కోత
- ఏకంగా 25 శాతానికి తగ్గింపు
- గతేడాది క్వింటాకు 40 శాతం
- ప్రస్తుతం రూ.9,400
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



దుత్తలూరు: అన్నదాతలకు శనగ విత్తనాల కొనుగోలు భారంగా మారింది. పంటల సాగుకు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసింది. కరువు పరిస్థితుల కారణంగా ఇబ్బంది పడుతున్న తరుణంలో సబ్సిడీని పెంచి శనగ విత్తనాలు అందించి ఆదుకోవాల్సిందిపోయి కుదించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 25 శాతం సబ్సిడీతో ఒరిగేది శూన్యమని పలువురు విమర్శిస్తున్నారు. బహిరంగ మార్కెట్ ధర కంటే క్వింటాపై రూ.2 వేలు అధికంగా వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం విత్తన కమిటీల వద్ద కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గతేడాది 40 శాతం సబ్సిడీతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేసింది. ఫలితంగా రైతులకు మేలు జరిగింది. అంతేకాక సకాలంలో పెట్టుబడి సాయం చేయడంతో సాగు ఇబ్బంది లేకుండా జరిగింది.

ఇక్కడిలా..

జిల్లాలో మొత్తం 20 మండలాల్లో సుమారు 34 వేల ఎకరాల్లో ఏటా శనగ సాగు చేస్తారు. ప్రస్తుతం వర్షాలు కురిసి శనగ విత్తేందుకు అనుకూల వాతావరణం నెలకొంది. దీంతో సాగుచేసే మండలాల్లో శనగ విత్తనాల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. జిల్లాకు 14 వేల క్వింటాళ్ల విత్తనాలు కేటాయించినట్లు అధికారుల సమాచారం.




సబ్సిడీ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతు

గరిష్టంగా ఎంతంటే?

రబీలో సాగు చేసే శనగ రైతులకు 25 శాతం సబ్సిడీపై మాత్రమే విత్తనాలు అందించేందుకు ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బయట మార్కెట్‌లో క్వింటా శనగ రూ.7,000 నుంచి 7,500 ధర పలుకుతోంది. ప్రభుత్వం ఇచ్చే జేజి – 11 క్వింటా ధర రూ.9,400 కాగా అందులో 25 శాతం రాయితీ రూ.2,350 పోను రూ.7,050 రైతులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే కాక్ – 2 రకం క్వింటా ధర రూ.12,100 ఉండగా రాయితీ రూ.3,025 పోను రూ.9,075 చెల్లించాలి. అలాగే ఒక్కో రైతుకు ఎకరాకు 40 కిలోల చొప్పున గరిష్టంగా ఐదెకరాలకు రెండు క్వింటాళ్లు పంపిణీ చేయనున్నారు. ఎకరా ఉన్న రైతుకు 40 కిలోలు, రెండెకరాలుంటే 80 కిలోల వంతున పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో..



గత రబీలో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శనగపై 40 శాతం రాయితీ అందించింది. ధర రూ.8,100 కాగా అందులో 40 శాతం అంటే రూ.3,240 పోను రైతులు 4,680కే క్వింటా విత్తనాలు పొందారు. అదనపు భారం పడకుండా సబ్సిడీ శాతం పెంచాలని నేడు రైతులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పంటల దిగుబడి తర్వాత గిట్టుబాటు ధరలు కూడా పెంచాలని కోరుతున్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం శనగలకు మద్దతు ధర క్వింటాకు రూ.5,650 ప్రకటించగా కనీసం పెట్టుబడులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాయితీ తగ్గించడం దారుణం



రెండేళ్లుగా సకాలంలో వర్షాలు కురవడం లేదు. శనగ సబ్సిడీ గతేడాది 40 శాతం ఇచ్చారు. ఇప్పుడు అధిక ధరకు విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి పెరుగుతుంది. ప్రభుత్వం ఇచ్చే విత్తన శనగ ధర బయట మార్కెట్‌కు మించి ఉంది.

– నూరె కొండారెడ్డి, బ్రహ్మేశ్వరం, రైతు

రైతుల కష్టాలు పట్టవా?



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల కష్టాలు గుర్తించి 40 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు సరఫరా చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సబ్సిడీని కుదించడం సరికాదు. కరువు పరిస్థితుల్లో రైతులపై ఇలాంటి భారం మోపడం దుర్మార్గం.

– మద్దసాని మాలకొండయ్య, అగ్రహారం, కొండాపురం మండలం

25 శాతం సబ్సిడీతో ఇస్తున్నాం



ప్రభుత్వం నిర్ణయించిన మేరకు 25 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు అందిస్తున్నాం. ఇప్పటికే ఆయా మండలాల్లో విత్తనాలు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవగాహన కల్పించాం. అర్హులైన ప్రతి రైతుకు 25 శాతం సబ్సిడీపై విత్తనాలు అందిస్తాం.

– పి.చెన్నారెడ్డి, ఏడీఏ, ఉదయగిరి

క్లుప్తంగా

దంపతులపై టీడీపీ వర్గీయుడి దాడి

లింగసముద్రం: వ్యవసాయ పనులు చేసుకుంటున్న దంపతులపై టీడీపీ వర్గీయుడు దాడి చేసిన ఘటన లింగసముద్రం మండలంలోని రాళ్లపాడులో గురువారం మధ్యాహ్నం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రాళ్లపాడు గ్రామంలో నివాసం ఉంటున్న ఎం.వెంకటరత్నమ్మ, ఆమె భర్త రవికి కొంత భూమి ఉంది. గురువారం అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయుడు మన్నేపల్లి రోశయ్య పొలం వద్దకు ట్రాక్టర్‌ను తీసుకెళ్లి దున్నుతుండగా అక్కడే ఉన్న వెంకటరత్నమ్మ, రవి ప్రశ్నించారు. దీంతో రోశయ్య వారిపై దాడి దిగాడు. వెంకటరత్నమ్మ గాయపడింది. మీకు దిక్కున్నచోట చెప్పుకోండి.. మా ప్రభుత్వం అధికారంలో ఉంది. ఏమైనా చేస్తామంటూ రోశయ్య బెదిరించాడు. కాగా నెలరోజుల క్రితం ఓ టీడీపీ నాయకుడు రవి, అతని కుమారుడిపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించాడు. దీనిపై కావలి డీఎస్పీ విచారణ కూడా చేపట్టారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశామని తమను ఇబ్బందులు పెడుతూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని రవి, వెంకటరత్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

అధికార పార్టీ ఎలా చెబితే అలా..

- వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

చేజర్ల: టీడీపీ నేతలు ఏం చెబితే అదే చేస్తున్నారు అధికారులు. వారు చెప్పగానే వైఎస్సార్‌సీపీ నేతల ఫ్లెక్సీలు తొలగించారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దసరా, దీపావళి సందర్భంగా మండలంలోని ఆదూరుపల్లి గ్రామంలో ఐదు వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను పెట్టారు. దీనిని అధికార పార్టీ నేతలు ఓర్వలేకపోయారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అండదండలు చూసుకుని రెచ్చిపోయారు. నేతలు చెప్పగానే ఈఓపీఆర్డీ రామయ్య అత్యుత్సాహం చూపించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసిన ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను గురువారం తొలగించారు. అంతే కాకుండా మండలంలో ఎక్కడైనా వైఎస్సార్‌సీపీ నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కేసులు బనాయిస్తామని పోలీసుల ద్వారా బెదిరించారు. ఈ వ్యవహారంపై నాయకులు మాట్లాడుతూ అధికార పార్టీ ఫ్లెక్సీలు తొలగిస్తే తమవి కూడా తీసేస్తామని చెప్పామన్నారు. అయినా పంచాయతీ సిబ్బందితో తమ అభిమాన నాయకుల ఫ్లెక్సీలను మాత్రమే తీసేయడం అన్యాయమన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి సభ్యురాలిగా విజయ



విజయ

వెంకటాచలం: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్యురాలిగా విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ విజయను నియమిస్తూ భారత ప్రభుత్వం గురువారం విడుదల చేసిన గెజిట్‌లో ప్రకటించింది. ఆమె మెరైన్ బయాలజీ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మెరైన్ కాలుష్యం అంశంపై పరిశోధనలు చేసి జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో అనేక పత్రాలను ప్రచురించారు. తీరంలో కాలుష్యం ప్రభావం, నివారణ మార్గాలపై జాతీయ సదస్సులను కూడా నిర్వహించారు. నెల్లూరు జిల్లాలోని ఆక్వా పరిశ్రమలు, థర్మల్ పవర్ ప్లాంట్లు తదితర వాటి వల్ల ఏర్పడుతున్న కాలుష్యం, దాని ప్రభావం వంటి అంశాలపై విజయ ఆధ్వర్యంలో అనేకమంది విద్యార్థులు పరిశోధన చేసి డాక్టరేట్‌లు పొందారు.

యువకుడితో వెళ్లిపోయిన వివాహిత

- పిల్లల పరిస్థితి ఏంటని అత్తామామలను నిలదీస్తున్న భర్త

కావలి: ఆమె ఇద్దరు పిల్లలకు తల్లి. ఓ యువకుడిని ప్రేమించి వెళ్లిపోవడంతో రెండు కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. కావలి రూరల్ మండలం తీర ప్రాంతంలో ఓ గ్రామంలో జరిగిన ఈ ఘటన పూర్వాపరాలిలా ఉన్నాయి. ఓ వ్యక్తికి, మహిళకు మూడేళ్ల క్రితం వివాహం కాగా ఇద్దరు పిల్లలున్నారు. ఆరునెలల క్రితం ఆమె ఆరోగ్య సమస్యపై పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో గ్రామంలోని ఓ యువకుడితో ప్రేమలో పడింది. అతడికి వివాహం కాలేదు. ఇద్దరూ కలిసి వెళ్లిపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె భర్త, ఇద్దరు పిల్లలను వెంటపెట్టుకుని అత్తగారి ఊరికొచ్చి పంచాయితీ పెట్టాడు. ఈ పరిణామాలతో కలత చెందిన యువకుడి తల్లిదండ్రులు గ్రామం నుంచి వెళ్లిపోయారు. తమ ఇంటిని, పొలాన్ని అమ్మకానికి పెట్టారు. ఈ నేపథ్యంలో సదరు మహిళ భర్త తాను ఇంకో పెళ్లి చేసుకుంటానని, పిల్లల పరిస్థితి ఏమిటని చర్చకు పెట్టాడు. దీంతో గ్రామస్తులు అమ్మకానికి పెట్టిన ఆ ఇల్లు, పొలం ఎవరూ కొనకూడదని, వాటిని వివాహిత ఇద్దరు పిల్లలకు మాత్రమే దక్కేలా చేయాలని నిర్ణయించారు. ఈ వ్యవహారంలో తాము కూడా బాధితులమేనని కనీసం ఇల్లు, పొలం దక్కకుండా చేస్తే ఎలా బతకాలని యువకుడి తల్లిదండ్రులు గోడు వెళ్లబోసుకుంటున్నారు.

మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలి

- మాజీ డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్

నెల్లూరు(దర్గామిట్ట)/నెల్లూరు(క్రైమ్): నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని మాజీ డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ముస్లిం నాయకులతో కలిసి కలెక్టర్ ఓ.ఆనంద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. అలాగే బీవీనగర్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, డీపీఈఓ శ్రీనివాసులనాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు బస్టాండ్ వద్ద మసీదు ఎదురుగా రెండు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఖలీల్ అహ్మద్, ముస్లిం నేతలు

మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో మద్యం దుకాణం పెడుతున్న విషయాన్ని నాటి మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన తక్షణమే స్పందించి ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకున్నారన్నారు. నేటి కూటమి ప్రభుత్వం ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. అలంకార్ సెంటర్‌లోని మద్యం దుకాణం సమీపంలో వేద సంస్కృత, బాలికోన్నత పాఠశాలలున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ కరిముల్లా, నాయకులు హంజాహుస్సేనీ, అబ్దుల్ మస్తాన్, అతహర్ బాషా, మీరామొహిద్దీన్, మొహమ్మద్ రవూఫ్, జియాఉల్‌హక్, అలీంబాషా, మహబూబ్‌బాషా (మాబాషా) తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం జరిగిన మూడో సెమిస్టర్ పరీక్షలో ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 7,757 మంది గానూ 7,241 మంది హాజరయ్యారని తెలియజేశారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో ఐదుగురు డిబార్ అయినట్లు వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్):	132
లేయర్ (లైవ్):	110
బ్రాయిలర్ చికెన్:	236
బ్రాయిలర్ స్కిన్‌లెస్:	262
లేయర్ చికెన్:	187

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.70
సన్నవి : రూ.40
పండ్లు : రూ.25

మోటార్‌బైక్ అదుపుతప్పి..

- ఇంజినీరింగ్ విద్యార్థి మృతి
- మరో విద్యార్థికి తీవ్రగాయాలు



విజయ్ కుమార్ (ఫైల్)

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతల సమీపంలో మోటార్‌బైక్ అదుపుతప్పి కలువాయికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ధనియాల విజయ్ కుమార్ (22) మృతిచెందాడు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కలువాయి మండలం వేదనపర్తికి చెందిన విజయ్ కుమార్, దగదర్తి మండలం మార్రెళ్లపల్లికి చెందిన వినయ్ కుమార్‌లు కడనూతలలోని ఆర్‌ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ ఫైనలియర్ చదువుతున్నారు. గౌరవరంలో గది అద్దెకు తీసుకుని రోజూ కళాశాలకు వచ్చి వెళ్తుంటారు. గురువారం సాయంత్రం కడనూతల నుంచి గౌరవరం వెళ్తుండగా ముంగమూరు కూడలి సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో విజయ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వినయ్ తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై భోజ్యా ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కాగా ఫైనలియర్ విద్యార్థి మృతితో ఆర్‌ఎస్సార్ విద్యార్థులు, అధ్యాపకుల్లో విషాదం నెలకొంది.

ఆటో మెకానిక్ దారుణ హత్య



ఘటనా స్థలంలో మృతదేహం



ముక్తియార్ (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): అందరూ చూస్తుండగానే ఆటో మెకానిక్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన నెల్లూరు అయ్యప్పగుడి వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ ముక్తియార్ (40) అలియాస్ మోటు, ముజాహిదా దంపతులకు నాయబ్ రసూల్, పర్వీన్‌లు సంతానం. నాయబ్ విజయవాడలో డిప్లొమా, కుమార్తె ఏడో తరగతి చదువుతున్నారు. ముక్తియార్ అయ్యప్పగుడి వద్ద పఠాన్‌బాబుకు చెందిన ఆటో మెకానిక్‌షెడ్‌లో పనిచేస్తున్నాడు. ఖాళీ సమయాల్లో ఆటో నడిపేవాడు. ఇటీవల యజమాని అతడిని పని నుంచి తొలగించాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. మూడు రోజులుగా మద్యం తాగి మెకానిక్ షెడ్‌కు వెళ్లి తనను పనిలోకి తీసుకోవాలని పఠాన్‌బాబును అడగసాగాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం కూడా ముక్తియార్ షెడ్ వద్దకు వెళ్లి యజమానితో గొడవపడ్డాడు. వారి మధ్య మాటామాటా పెరిగింది. కోపోద్రిక్తుడైన బాబు పదునైన ఆయుధంతో కొట్టడంతో తలపగిలి ముక్తియార్ అక్కడికక్కడే మృతిచెందాడు. నిందితుడు పరారయ్యాడు. సమాచారం అందుకున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ ఆర్‌ఎస్ కిశోర్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని హత్యకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబసభ్యులకు విషయం తెలియజేశారు. ముజాహిదా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మాటామాటా పెరగడంతోనే హత్య జరిగిందా లేదా మరేదైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మృతుడు గతంలో తల్పగిరికాలనీకి చెందిన సురేష్ హత్య కేసులో నిందితుడని పోలీసుల విచారణలో వెల్లడైంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఘటనా స్థలంలో మల్లికార్జున మృతదేహం

మనుబోలు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన కుడుమల మల్లికార్జున (55) కల్లుగీత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. మోటార్‌బైక్‌పై మనుబోలు నుంచి యాచవరం బయలుదేరాడు. ఈ క్రమంలో మనుబోలు బైపాస్‌రోడ్డు వద్ద నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న మినీవ్యాన్ బైక్‌ను ఢీకొనడంతో మల్లికార్జున అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మృతుడి భార్య అమరావతి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఎస్సై రాకేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమ్మేసిన గుర్రపుడెక్క



నెల్లూరు బారాషహీద్ దర్గా ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏటా రొట్టెల పండగ సందర్భంగా ఇక్కడికి దేశ నలుమూలల నుంచి ప్రజలు కులమతాలకు అతీతంగా విచ్చేస్తుంటారు. ఆ సమయంలో హడావుడి చేసే అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం స్వర్ణాల చెరువులో గుర్రపుడెక్క పెరిగిపోయింది. పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన ఏపీ టూరిజం బోటును గుర్రపుడెక్క మధ్యలో వదిలేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

